జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘ పరిధిలో జీఎస్టీ 2.0–సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బందితో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని సెలూన్ సెంటర్లు, జిమ్ సెంటర్లు, బ్యూటీ పార్లర్స్, యోగా సెంటర్లలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ముందస్తుగా నిర్వహించిన సమావేశంలో జీఎస్టీ డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌లు బిబి.వెంకటేశ్వరరావు, జి.సురేష్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ హెచ్‌డబ్ల్యూవోలు ఆర్.అనురాధ, జి.రాజకుమార్ పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపు గురించి ఆయా సెంటర్లలో ఎలా తెలియజేయాలో వివరించారు. అనంతరం సంబంధిత అధికారులంతా కలిసి మున్సిపల్ పరిధిలోని సెలూన్, జిమ్ సెంటర్లు, జిమ్ సెంటర్లు, యోగా సెంటర్లకు వెళ్లి తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ డీటీవీ.కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, జీఎస్టీ అధికారులు

క్లుప్తంగా

ఆటల పోటీలకు ఎంపికలు

వత్సవాయి: పాఠశాల గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీలలో వత్సవాయి జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడాకారులకు ఎంపికలు నిర్వహిస్తామని ఎంఈవో ఎల్.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి క్రీడాకారులు బాలురు, బాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికలుంటాయని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు 8 వ తేదీ ఉదయం 9 గంటలకు వత్సవాయి జెడ్పీ పాఠశాలలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపులు



పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పూజలందుకున్న అమ్మవార్ల విగ్రహ నిమజ్జన ఊరేగింపులు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక తూర్పు బజారులోని దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, భక్తుల కోలాట నృత్యాల మధ్య గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

కోటయ్యకు నివాళి



గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ పార్టీ నాయకులు వరికూటి కోటయ్య (55) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గ్రామానికి వెళ్లి కోటయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటయ్య పార్టీ బలోపేతంకోసం పనిచేశాడని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు న్యాయవాది మంగలపూడి కోటిబాబు, ప్రముఖ న్యాయవాది మంగలపూడి సన్నీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రాకు స్వచ్ఛగ్రీన్ అంబాసిడర్ అవార్డు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని గండ్రాయి గ్రామ పంచాయతీ క్లాప్ మిత్రాకు మాడుగుల కాశమ్మ (పారిశుద్ధ్య కార్మికురాలు)కు స్వచ్ఛాంధ్ర స్వచ్ఛగ్రీన్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికై ందని ఎంపీడీవో నితిన్ సోమవారం తెలిపారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇంటింటికి వెళ్లి తడి–పొడి చెత్త సేకరించడంలో పలువురు ప్రశంసలు పొందటంతో ఈ అవార్డుకు ఆమె ఎంపికైందన్నారు. ఈ నెల 7న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తారన్నారు.

190 మందికి వైద్య పరీక్షలు



నందిగామరూరల్: మండలంలోని తొర్రగుడుపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు రోసిపద్మ, అచంట లక్ష్మీపతి, కౌశిక్‌లు రోగులను పరీక్షించారు. మొత్తం 190 మంది రోగులు వైద్య పరీక్షలకు రాగా అందులో 45 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేసుకునేందుకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నె కళావతి, సర్పంచ్ చెరుకూరి హైమారావు, ఫౌండేషన్ ప్రతినిధి కట్టా నరసింహారావు, సాంబశివరావు, వినయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8 మంది జూదరులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కోత ముక్క ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్న కొత్తపేట పోలీసులు వారి నుంచి రూ.1.11 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి జక్కంపూడి గ్రామ శివారులో కొంతమంది కోత ముక్క ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో గ్రామ శివారులో తనిఖీ చేసిన కొత్తపేట పోలీసులకు పొలాల్లో కొంత మంది కోత ముక్క ఆడుతున్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారిని స్టేషన్‌కు తరలించడంతో పాటు కేసు నమోదు చేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రామ్మోహనరావు డిమాండ్

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు, పెన్షనర్లను నిర్లక్ష్యం చేస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సొనె రామ్మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ మేరకు సానె మాట్లాడుతూ, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు, 11 పీఆర్సీ అరియర్స్ ఇవ్వలేదని తెలిపారు. కనీసం 12వ పీఆర్సీ కమిషన్ వేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం చేయలేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం త్వరలోనే డీఏ, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, సంఘ నాయకులు బీవీ సర్వేశ్వరరావు, కేవీవీ రమణమూర్తి, వీ ప్రసాద్, షేక్ జాన్‌మియా, అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.


యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామ్మోహనరావు

ఉచిత కంటి పరీక్షలు

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో విజయవాడకు చెందిన మాక్సీ విజన్ ఐ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి ఉచిత కంటి పరీక్షలు జరిపారని రామ్మోహనరావు అన్నారు. 45మందికి కంటి పరీక్షలు చేసి వారిలో నలుగురికి కాటరాక్టు ఆపరేషన్లు చేయాలని చెప్పారు.

న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నందిగామరూరల్:భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడుని కఠినంగా శిక్షించాలని నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు మాట్లాడుతూ సుప్రింకోర్టులో పని చేస్తున్న న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడి చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోపు శ్రావణ్ కుమార్, దాసరి వెంకట్రావు, నంద్రు శ్రీరాంమూర్తి, పెసరమల్లి సురేష్, గుర్రాల వెంకటరత్నం, కురగంటి రాంబాబు, కర్ల నాగభూషణం, సుమన్, కృష్ణప్రసాద్, వీరబాబు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండించిన పేట న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ రామకృష్ణ గవాయిపై జరిగిన దాడిని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఖండించారు. భారత ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది రాకేష్ కిషోర్‌బాబు బూటుతో దాడి చేయడాన్ని నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం సమావేశమై చట్టవ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ గౌరవ భారత న్యాయమూర్తిపై దాడి అత్యంత హేయమని, న్యాయవ్యవస్థకే గొడ్డలిపెట్టు అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హక్కులను పరిరక్షించి వారికి అండగా ఉండే న్యాయవ్యవస్థనే అవమాన పరచి భారత ప్రజాస్వామ్యానికి ఒక కళంకాన్ని తెచ్చిన దుర్మార్గులపై చట్టపరంగా శిక్షించడమే కాకుండా న్యాయస్థానాల్లో న్యాయవాద వృత్తి చేపట్టకుండా నిషేధించాలని కోరారు. దుష్టత్వంతో కూడిన అటవిక చర్యలను ఉక్కుపాదంతో అణచివేయాలని న్యాయవాదులే కాకుండా ప్రజాస్వామ్యవాదులంతా ముక్త కంఠంతో ఈ చర్యలను గర్హించాలని తెలిపారు.


న్యాయవాది రాకేష్ కిషోర్‌ను శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్న న్యాయవాదులు

17వ వరల్డ్ కరాటే పోటీల్లో విజయ్‌కుమార్ ప్రతిభ


విజయ్‌కుమార్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు ది వరల్డ్ షోటోకాన్ కరాటే డో–ఫెడరేషన్ ఆధ్వర్యంలో జపాన్‌లోని షిన్‌యోకోహామా ప్రాంగణంలో జరిగిన 17వ వరల్డ్ కరాటే పోటీల్లో నగరానికి చెందిన జె.విజయ్‌కుమార్ ప్రతిభ చూపారు. 7వ బ్లాక్ బెల్ట్ డాన్(ననడాన్) అవార్డ్‌తో పాటుగా నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లుగా విజయకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వరల్డ్ కరాటే పోటీలకు ఇండియా తరపున తాను ప్రతినిధిగా ఈ పోటీల్లో పాల్గొనడమే కాకుండా 7వ బ్లాక్ బెల్ట్ డాన్‌ను పొందడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వరల్డ్ కరాటే పోటీల అనంతరం కరాటే మాస్టర్లకు కరాటే శిక్షణ ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా శిక్షణా తరగతులు జరిగాయని, వాటిలో కూడా తాను పాల్గొన్నట్లు విజయ్‌కుమార్ వివరించారు. కరాటేలో శిక్షణ పొందడటం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, యువతీ యువకులు కరాటేలో శిక్షణ తీసుకోవాలని విజయ్‌కుమార్ సూచించారు.


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విజయ్‌కుమార్

సెరిబ్రల్ పాల్సీపై అవగాహన అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సెరిబ్రల్ పాల్సీపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఆరంభంలోనే సరైన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని 'చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ' ప్రిన్సిపాల్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టి.కృష్ణకుమారి పేర్కొన్నారు. ప్రపంచ సెరిబ్రల్ పాల్సీడే పురస్కరించుకుని సోమవారం నూజివీడు రోడ్డులో చేయూత సంస్థ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అంటే మస్తిష్క పక్షపాతం లాంటిదన్నారు. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలు కదలికలు, మాట్లాడటం, తాగడం తదితర విషయాల్లో ఇబ్బందులు పడతారన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ఎప్పటికప్పుడు గమనించాలని.. ఏమైనా అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రత్యేక చిన్నారులు ప్లకార్డులు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారులు పాల్గొన్నారు.


ప్రత్యేక చిన్నారుల అవగాహన ప్రదర్శన

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడి చేసిన యువకులపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లీనగర్ మసీదు వీధిలో షేక్.మహాబులి కుటుంబం నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి మహాబులి, తన బావ షేక్ ఖాజాతో కలిసి బయటకు పని మీద వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో బంధువుల అమ్మాయి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఎక్కడికి అని ఆరా తీశారు. అదే క్రమంలో రోడ్డుపై నిల్చొని ఉన్న కొంత మంది యువకులు మహాబులిని అడ్డగించి, ముఖంపై సిగరెట్ పొగ వదిలి దాడికి పాల్పడ్డారు. దీంతో మహాబులి, ఖాజాలకు గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కంచికచర్లలో వాహనాల తనిఖీ



కంచికచర్ల :వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి పలు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలను అతివేగంగా నడపరాదని చెప్పారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్‌సీ, పొల్యూషన్, తదితర పత్రాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. వాహనాన్ని నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయరాదన్నారు. వాహనాలను మైనర్లకు ఇవ్వరాదని సూచించారు. ఎటువంటి పత్రాలు లేని 23 వాహనాలను గుర్తించి వారికి రూ. 4వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ అన్నారు.

8 న స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఎంపికలు

జగ్గయ్యపేట అర్బన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో 8వ తేదీన నిర్వహిస్తున్నామని ఎంఈవో ఎల్.చిట్టిబాబు, పీడీలు ఎం.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికలు పాల్గొనాలని కోరారు.

స్టెల్లాలో ఆకట్టుకున్న ఎథ్నిక్ షో



పటమట(విజయవాడతూర్పు): పెరుగుతున్న నాగరికతతో సంప్రదాయాలు మారుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాలను తెలుసుకుని వాటిని ఆచరించాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. స్టెల్లా కళాశాలలో జరుగుతున్న కల్చరల్ వీక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఎథ్నిక్‌వేర్ షో జరిగింది. కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయ దుస్తులను ధరించి ప్రదర్శించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి దియాపాటిల్, రెండో బహుమతి ప్రసన్న రేణుక, మూడో బహుమతి అస్మిత దక్కించుకున్నారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బ్యూలా, ఎంబీఏ విభాగాధిపతి నాగసుందరి వ్యవహరించగా అధ్యాపకులు స్వరూపారాణి, సారా కుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో పేద ముస్లిం, మైనార్టీల సంక్షేమం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలోని ఏఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇమామ్, మౌజన్‌లకు జీతాలు పెంచిన ఘనత జగనన్నదేనని పేర్కొన్నారు. అంతేకాక పేద ముస్లిం ఆడపిల్లల పెళ్లికి వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా ఆర్థిక సాయం అందించలేదని ఆరోపించారు. అనంతరం ఎండీ సూరజ్ బాషా, ఎండీ రఫీ, అబ్దుల్ ముఖిత్‌లకు కమిటీ ప్రతినిధులుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలాన సాజిద్ అలీ, అధికార ప్రతినిధి సిలార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న షేక్ నాగుల్‌మీరా

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

కంచికచర్ల: మహాలక్ష్మీ అమ్మవారి కల్యాణ మండలంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కంచికచర్ల సమీక్షా సమావేశం జరిగిందని లయన్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో ముందుగా లయన్స్ క్లబ్ కమిటీని లయిన్ గవర్నర్ వీవీ పీఎస్ ఆంజనేయులు సౌజన్యంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. క్లబ్ అధ్యక్ష్యుడు ముప్పా శివరామ వరప్రసాద్, కోశాదికారి కోనేటి శ్రీనివాసరావు, సభ్యులుగా కుర్రా కిరణ్, దేవిరెడ్డి శ్రీనివాసరావు, పసుపులేటి గోపీ, ఏ శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందని ప్రభాకరరావు తెలిపారు. అనంతరం ఉషోదయ స్కూల్‌లో 300 మంది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ టెస్టులు చేయటంతో పాటు 10మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని గుర్తించి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. అదే పాఠశాలలో చదివే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో లయిన్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ ప్రభాకర్ క్లినిక్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పూర్వపు గవర్నర్ లయన్ మిరియాల వెంకటేశ్వరరావు, 1వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వీఎస్‌వీ ప్రసాద్, 2 వైస్ డిస్ట్రిక్ గవర్నర్ శ్రీనివాసరెడ్డి, రవీంద్ర, నంబూరు పెదబాబు, పెద్దినీడి కోటేశ్వరరావు, సానె రామ్మోహనరావు, బచ్చు రంగరావు, నన్నపనేని దుర్గారావు, పాల్గొన్నారు.


కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవం

వీరులపాడు:ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. వీరులపాడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు అంత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు జగన్‌మోహనరావుకు ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జగన్‌మోహనరావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేశారు. శైవ క్షేత్ర పిఠాధిపతులు శివస్వామి అమ్మవారి ఆలయ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవల రమేష్, నాయకులు సూర్యదేవర వినయ్, ఆలయ కమిటీ సభ్యులు అద్దంకి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు తదితరులు

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

కృషి విజ్ఞాన కేంద్ర విద్యాలయ శాస్త్రవేత్త శివప్రసాద్

నందిగామ రూరల్:మండలంలోని పల్లగిరి గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగిందని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రవికిషోర్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి కేవీకే శాస్త్రవేత్త శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రైతులు సమతుల్య ఎరువులు యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడులలో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు గ్రూపుగా ఏర్పడి కస్టమ్ హైరింగ్ సెంటర్స్‌ను బయో రిసోర్స్ సెంటర్‌లను విలువ ఆధారిత ఉత్పత్తుల వల్ల నికర ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. వరి ఇతర పంటలలో జీవన ఎరువులు అజోస్పైరీలం, ఫాస్పరస్ సాల్బు లైజింగ్ బ్యాక్టీరియా పొటాషియం రీలీజింగ్ బ్యాక్టీరియా, రైజోబియం, అజోల్లా ఉపయోగాల గురించి వెల్లడించారు. వివిధ పంటల్లో ఎండు తెగులు తట్టుకోవడానికి ఉపయోగపడే తీరును తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేల్పుల భిక్షాలు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని అన్ని గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్ డిమాండ్ చేశారు. పల్లెపల్లెకు మద్యాన్ని పంపుతున్న ప్రభుత్వం గిరిజన పిల్లలకు మంచినీటిని ఎందుకివ్వరని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన విషాదకర సంఘటన గిరిజన విద్యార్థుల జీవితాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసిందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 611 మంది గిరిజన బాలికలలో ఇద్దరు విద్యార్థినులు పచ్చ కామెర్లతో మృతి చెందటం బాధకరమని పేర్కొన్నారు. 120 మందికి పైగా విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారన్నారు. సంఘటనకు బాధ్యులైన అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాల లేమి..

పచ్చకామెర్లు అనేది ఒక రోజు, వారం రోజులు లేదా నెల రోజుల నిర్లక్ష్యం వల్ల వచ్చిన వ్యాధి కాదని, గత కొన్నేళ్లుగా విద్యార్థినులు రక్షిత మంచినీరు వినియోగించడం లేదని స్పష్టమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఒక్క చర్య కూడా తీసుకోలేదన్నారు. ఏడాదిన్నరగా ఏఎన్ఎంల నియామక ఫైలు పెండింగ్‌లో ఉందని, పారిశుద్ధ్య సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దోమతెరల పంపిణీ నిలిపివేయడం, తాగునీటి ప్లాంట్ల నిర్వహణను వదిలేయడం వంటి నిర్లక్ష్య నిర్ణయాలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, అనారోగ్య పరిస్థితులు విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని దుయ్యబట్టారు.

జమాక్ స్టోర్స్ చైర్మన్‌గా మహమ్మద్ రిజ్వాన్

ఆటోనగర్(విజయవాడతూర్పు): ది జవహర్ ఆటోనగర్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కన్స్యూమర్ కో ఆపరేటివ్ స్టోర్స్‌కు సోమవారం నూతన పాలకవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. నూతన పాలక వర్గం చైర్మన్‌గా మహమ్మద్ రిజ్వాన్, సెక్రటరీగా మంగం నాగేశ్వరరావు, వైస్ చైర్మన్లుగా కొండేపాటి మోహనరావు, అబ్దుల్ కలాం, జాయింట్ సెక్రటరీలుగా త్రిపురనేని హనుమాల్ నాగచంద్, వాటపల్లి శ్రీరాములు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, జామక్ స్టోర్స్ మాజీ చైర్మన్‌లు కత్తిక శివనాగేశ్వరరావు, సుంకాని వెంకట త్రినాథ్ పాల్గొన్నారు.

వార్డులకు ఎన్నిక

తొలుత కో ఆపరేటివ్ స్టోర్స్‌లోని 6, 13, 16, 17, 18వ వార్డులకు ఎన్నికలు నిర్వహించగా బత్తుల ప్రసాద్, గడదాసు కోటేశ్వరరావు, చింతల సుబ్రహ్మణ్యేశ్వరరావు, జలపారి సురేష్‌కుమార్, మేరుగ వెంకట రాజారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వేమూరి సామ్రాట్ కుమార్ వ్యవహరించారు.


చైర్మన్ మహమ్మద్ రిజ్వాన్, కార్యదర్శి మంగం నాగేశ్వరరావులను సత్కరిస్తున్న నాయకులు

ఆటో ఢీ కొని మహిళకు గాయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీ కొనడంతో ఒక మహిళ తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలైన సంఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రామరాజ్యనగర్‌కు చెందిన ఎస్.రామలక్ష్మి(38) స్థానికంగా కుటుంబంతో కలిసి జీవిస్తోంది. ఆమె పాచిపనులు చేస్తుండగా, భర్త వెంకటదుర్గారావు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 29న సితారా సెంటర్ వద్ద ఒక ఆటో ఆమెను వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో రామలక్ష్మి అక్కడ పడిపోయి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ఆమెను చూసిన చుట్టుపక్కల వారు భర్త దుర్గారావుకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో రామలక్ష్మిని నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.